క్లుప్తంగా

శారదాపీఠంలో రాజశ్యామల యాగం



యాగాన్ని ప్రారంభిస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి

పెందుర్తి: శారదాపీఠం వార్షికోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ పీఠ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాభిషేకాలు జరిపారు. అనంతరం స్వామీజీ చేతుల మీదుగా రాజశ్యామల యాగం, సూర్య హోమం, సుబ్రహ్మణ్యహోమం శాస్త్రోక్తంగా చేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ నేతృత్వంలో పూజలు జరిగాయి.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

పరవాడ: బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల పట్ల విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని, మాట్లాడారు. గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ జి.నారాయణరావు, సివిక్స్ అధ్యాపకులు లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్



పట్టుబడిన పేకాటరాయుళ్లతో పోలీసులు, స్వాధీనం చేసుకున్న నగదు, మొబైళ్లు

పరవాడ: మండలంలోని మడకపాలెం సమీపంలో నిర్మానుష్య ప్రదేశంలో గుట్టుగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పరవాడ పోలీసులు మంగళవారం రాత్రి దాడులు జరిపారు. పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్, ఎస్ఐ కృష్ణారావు తమ సిబ్బందితో దాడిచేసి ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.30,300 నగదు, 6 సెల్ ఫోన్లను స్వాధీనపర్చుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు.

ఇక్కడ పనిచేయలేం మహాప్రభో!

- గ్రామాలు/వార్డుల్లో పనులపై కూటమి పార్టీల కీచులాటలు
- 'ఒకరు చేయాలని.. మరొకరు వద్దని'అధికారులపై తీవ్ర ఒత్తిళ్లు
- నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఇబ్బందుల్లో అధికారులు
- నియోజకవర్గం నుంచి బదిలీల కోసం ప్రయత్నాలు చేస్తున్న దైన్యం!

పెందుర్తి:

నియోజకవర్గంలో అధికార టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి నాయకుల ఆధిపత్య పోరులో అధికారులు నలిగిపోతున్నారు. గ్రామాల్లో, వార్డు స్థాయిలో తమ పనులు చేయాలని, ఎదుటివారి పనులు చేయొద్దంటూ టీడీపీ, జనసేన నాయకులే కీచులాడుకోవడంతో అధికారులకు సంకటంగా మారింది. చోటామోటా నాయకులు తమ పార్టీలకు చెందిన ముఖ్యనేతలతో అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా పనులు చేస్తూ కొందరు అధికారులు తమ ఉద్యోగాలకు ముప్పు తెచ్చుకుంటున్నారు.

బదిలీల కోసం ప్రయత్నాలు!

వాస్తవానికి పెందుర్తి నియోజకవర్గంలో పనిచేయడానికి కిందిస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు అందరూ ఆసక్తి చూపుతారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఇదే తరహాలో 'తమదైన శైలి'లో చాలా మంది అధికారులు ఇక్కడకు కోరి మరీ బదిలీపై వచ్చారు. అయితే వారి సంతోషం మూణ్నాళ్ల ముచ్చటే అయింది. కూటమిలోని టీడీపీ, జనసేన ముఖ్యనేతలు, వారి అనుచరుల చర్యలకు అడ కత్తెరలో పోక చెక్క మాదిరిగా తమ పరిస్థితి మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గౌరవంగా పనిచేయాల్సిన చోట నాయకుల తీరుతో ప్రజల వద్ద అవమానాలకు గురవుతున్నామని అధికారులు వాపోతున్నారు.

సాధారణంగా గ్రామాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రత్యర్థులుగా ఉంటాయి. అధికారంలో ఉన్నవారు ప్రతిపక్ష పార్టీ నాయకుల పనులు చేయొద్దని చెప్పడం.. దాన్ని అధికారులు పాటించడం సర్వసాధారణం. కానీ కూటమి ప్రభుత్వంలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. కేవలం ఎన్నికల్లో గెలుపు కోసం మాత్రమే జతకట్టిన జనసేన, టీడీపీ నాయకులకు పాత శత్రుత్వాలు పోలేదు. దీంతో నియోజకవర్గంలో ఎవరికి వారు తమ ఉనికి కోసం స్వపక్షం వారినే టార్గెట్ చేస్తున్నారు. ఈ క్రమంలో అధికారుల మెడ మీద కత్తి పెట్టి ఒకరిపై ఒకరు వేధింపులకు దిగుతున్నారు.



పెదగాడిలో ట్విస్ట్‌ల మీద ట్విస్ట్‌లు

మండలంలోని పెదగాడి సర్పంచ్ కేసుబోయిన లావణ్య, ఆమె భర్త కేసుబోయిన త్రినాథ్‌పై గుర్రుగా ఉన్న స్థానిక జనసేన నాయకుడు నీటిపల్లి రమేష్ తదితరులు పంచాయతీలో నాలుగేళ్లుగా జరిగిన కార్యకలాపాలపై సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం అడిగారు. కానీ.. వారు దరఖాస్తు పెట్టిన నాలుగు రోజులకే ఆయా పత్రాలు కావాలని జనసేన నాయకులు పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరావుపై ఒత్తిడి తెచ్చారు. సెలవులో ఉన్నప్పటికీ.. కార్యదర్శి లక్ష్మణరావు హడావుడిగా రాత్రి సమయంలో వచ్చి ఆయా పత్రాలు ఇచ్చారన్నది సర్పంచ్ లావణ్య ఆరోపణ. దీనిపై ఆమె జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొంటర్‌గా జనసేన నాయకుల ఒత్తిడితో కార్యదర్శి లక్ష్మణరావు సర్పంచ్, ఆమె భర్తపై పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు. అయితే తాను ఆరోగ్య సమస్యలు ఒత్తిడి వలన సర్పంచ్‌పై తప్పుడు కేసు పెట్టానని, ఆ కేసును విత్‌డ్రా చేసుకుంటున్నట్లు కార్యదర్శి రాతపూర్వకంగా ప్రకటించారు. మళ్లీ జనసేన నాయకుల ఒత్తిడితో సర్పంచ్‌పై ఆరోపణలు చేస్తూ కార్యదర్శి లక్ష్మణరావు కేసు పెట్టారు. దీనిపై విచారణ చేసి వారంలో నివేదిక ఇవ్వాలని విశాఖ జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఎంపీడీవో వెంకట్రావును ఆదేశించారు. దీనిపై ఈవోపీఆర్డీ అప్పలరాజును విచారణాధికారిగా నియమించారు. సెలవులో ఉన్న కార్యదర్శి లక్ష్మణరావును మంగళవారం తాత్కాలికంగా విధుల నుంచి తప్పించి, ఇన్‌చార్జిగా పినగాడి కార్యదర్శి శ్రీరామ్మూర్తికి బాధ్యతలు అప్పగించారు. ఇన్ని ట్విస్ట్‌లకు కూటమి నాయకుల ఆధిపత్య పోరే కారణం.



పెదగాడి పంచాయతీ వివాదంపై సర్పంచ్ లావణ్య వివరణ తీసుకుంటున్న ఎంపీడీవో వెంకట్రావు, అధికారులు

అక్రమ నిర్మాణాలు.. అధికారులపై ఒత్తిళ్లు

పెందుర్తి మండలం, జెర్రిపోతులపాలెంలో ఉన్న డీ ఫారం భూముల్లో వాణిజ్య సముదాయాల నిర్మాణానికి కూటమికి చెందిన సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు ప్రయత్నం చేస్తున్నారని అదే కూటమికి చెందిన నాయకులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. లాట్... మేం కూడా అధికార పార్టీకి చెందిన వాళ్లమే.. వారు చెబితే మీరు ఆపడం ఏంటి? అని ఆ నిర్మాణదారులు రెవెన్యూ సిబ్బందిపై చిందులు తొక్కుతున్నారు. జనసేన, టీడీపీ ముఖ్య నేతల వద్ద పంచాయితీలు పెట్టి ఆయా అధికారులను దుర్భాషలాడుతూ.. 'ఇక్కడ పనిచేయాలంటే మా మాటే వినాలి'అని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీంతో ఏం చేయాలో పాలుపోవడంలేదు.. ఆరోగ్యాలు పాడవుతున్నాయని ఆ అధికారులు వాపోతున్నారు'

రాజకీయ కక్షకు వీఆర్వో బదిలీ!

జిల్లాస్థాయి సంఘంలో ఉన్నత స్థాయిలో ఉన్న ఓ వీఆర్వో మరో ఆరు నెలల్లో పదవీ విరమణ చేయనున్నారు. ఓ వైపు ఆఫీస్ బేరర్‌గా ఉన్న అతడ్ని బదిలీ చేయడానికి వీల్లేదు. నిబంధనల ప్రకారం 2 ఏళ్లలోపు రిటైర్మెంట్ ఉన్నవారిని వారు కోరుకున్న చోటే ఉంచాలి. అయితే జనసేనకు చెందిన ముఖ్యనేతల ఒత్తిడితో ఆ వీఆర్వోను ఏకంగా జిల్లా దాటి బదిలీ చేశారు. కేవలం రాజకీయ కక్షతోనే ఈ చర్యలకు పాల్పడ్డారని మండలంలోని పలువురు రెవెన్యూ అధికారులు ఆరోపిస్తున్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

సబ్బవరం: పదోతరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి ఇ.అప్పారావునాయుడు సూచించారు. మండలంలోని రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఉప విద్యాశాఖాధికారి బి.అప్పారావుతో కలిసి మంగళవారం సందర్శించారు. టెన్త్ విద్యార్థులతో సమావేశమై, సంభాషించారు. విద్యార్థుల స్థాయిపై సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. సబ్బవరంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని రాత్రి సందర్శించి, టెన్త్ విద్యార్థుల చదువు తీరును పరిశీలించారు. ఆ తర్వాత సబ్బవరం ప్రభుత్వ హైస్కూల్ టెన్త్ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, వారిని బాగా చదవాలని ప్రోత్సహించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు సానుకూల వాతావరణం ఇంట్లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట ఎంఈవోలు లక్ష్మణరావు, ఎంజే రవీంద్రబాబు, ఉపాధ్యాయులు ఉన్నారు.



సబ్బవరం బాలికల ఎస్సీ హాస్టల్‌ను నైట్ విజిట్ చేసి, విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

'లీజు రద్దు చేయకపోతే ఆమరణ నిరాహార దీక్ష'

సింహాచలం: సింహగిరిపై కల్యాణమండపాల లీజును పూర్తిగా రద్దుచేసి, కాంట్రాక్టర్‌కి ఇచ్చిన నెల రోజుల గడువును ఉపసంహరించుకోవాలని సనాతన ధర్మ పరిరక్షణ సమితి జేఏసీ హెచ్చరించింది. దేవస్థానం అధికారులు స్పందించకపోతే ఆమరణ నిరాహార దీక్షకు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు హెచ్చరించింది. జేఏసీ ఆధ్వర్యంలో సింహాచలంలోని తొలిపావంచా వద్ద రెండో రోజు రిలే నిరాహార దీక్షలో జేఏసీ కన్వీనర్ పూడిపెద్ది శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కల్యాణమండపాలు లీజుకివ్వడంతో అధిక ధరల వల్ల పేదలు వివాహాలు చేసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. గత కాంట్రాక్టర్‌కు దేవస్థానం అధికారులు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు.

కల్యాణమండపం నిధుల దుర్వినియోగంపై విచారణ



వెన్నలపాలెంలోని కల్యాణమండపం

పరవాడ: మండలంలోని వెన్నలపాలెంలో నిర్మించిన కల్యాణ మండపం నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదు మేరకు అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) ఆర్.శిరీషరాణి మంగళవారం గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించి ప్రాథమిక విచారణ జరిపారు. పంచాయతీలోని కల్యాణమండపం ద్వారా వచ్చిన సుమారు రూ.15 లక్షల నిధులు దుర్వినియోగం అయ్యాయని గ్రామానికి చెందిన గొంప మారునాయుడు డీపీవోకు గత డిసెంబర్ 30న ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆమె ప్రాథమిక విచారణ నిర్వహించారు. ఈ విచారణలో పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన మల్లికార్జునరావు, వరలక్ష్మిలను విచారించారు. 2019 నుంచి కల్యాణమండపం లావాదేవీలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. డీపీవో వెంట పరవాడ ఇన్‌చార్జ్ ఎంపీడీవో ధర్మారావు కూడా ఉన్నారు.

ఘనంగా అక్కులమ్మ పేరంటాలు తీర్థమహోత్సవం



అక్కులమ్మ పేరంటాలకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి శివారు రావలమ్మపాలెంలో అక్కులమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. జక్కాన సూర్యనారాయణ, శ్రీరామ్మూర్తి, సూర్య వెంకటరావు, సత్యనారాయణల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవంలో వేకువ జాము నుంచే అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భారీ అన్నసమారాధన జరిపారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బాలనాగమ్మ బుర్రకథ ఆకట్టుకుంది. అమ్మవారిని దర్శించుకున్నవారిలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, జక్కాన శ్రీను, వెంకటరావు తదితరులు ఉన్నారు.

మర్యాదపూర్వక కలయిక



తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పురోగతిని వివరించారు. ఆయనతోపాటు మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు, నియోజకవర్గ నేత శరగడం చినఅప్పలనాయుడు ఉన్నారు.

–పెందుర్తి

వ్యాక్సిన్లు సకాలంలో వేయించేలా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్‌దేవ్

పరవాడ: ఆశా కార్యకర్తలందరు అంకితభావంతో పనిచేసి, ప్రతి ఒక్కరికీ వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్‌దేవ్ సూచించారు. ఆశా డే సందర్భంగా పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. అనంతరం పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ మీజిల్స్ వ్యాధి రాకుండా ప్రతి బిడ్డకు వ్యాక్సిన్ అందించాలన్నారు. ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్న నులిపురుగుల నివారణ దినోత్సవంలో నిర్ణీత వయసున్న ప్రతి ఒక్కరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా చూడాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి డి.లోవరాజు మాట్లాడుతూ అక్రమ దత్తత, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, లింగ నిర్ధారణ పరీక్షలు, బాలల హక్కులకు భంగం కలిగించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జయశ్రీ కరిష్మా, స్టాటిస్టికల్ అధికారి రామచంద్రరావు, కమ్యూనిటీ హెల్త్ అధికారి ఎంఎస్ఎస్ సాయిరాం, పీహెచ్ఎన్ జానకీ రామన్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్యాన్సర్ నియంత్రణ

సబ్బవరం: ప్రారంభ దశలో క్యాన్సర్‌ను గుర్తించి, చికిత్స పొందితే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి తెలిపారు. అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థులకు మంగళవారం అవగాహనా కల్పించారు. మహిళలు, విద్యార్థులు క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేయించుకోవాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, అధ్యాపకులు డాక్టర్ సత్యనారాయణ, ఎంవీ రామకృష్ణ, ఎం గోవిందరావు, యమున, డాక్టర్ రత్నప్రకాష్, డాక్టర్ వై.రాజేష్, జాతీయ సేవా సమితి ప్రోగ్రాం అధికారి గణేష్ పాల్గొన్నారు.

కామేశ్వరి ఆలయంలో గణబాబు పూజలు

పెందుర్తి: స్థానిక మహాకామేశ్వరి ఆలయాన్ని ప్రభుత్వ చీఫ్ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మంగళవారం సాయంత్రం సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. గణబాబు వెంట జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఉన్నారు.

తన్నో ఆదిత్య ప్రచోదయాత్



పెందుర్తిలో పూజలందుకుంటున్న సూర్యభగవానుడు

- ఘనంగా రథసప్తమి వేడుక
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

పెందుర్తి: ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడి నామస్మరణతో పెందుర్తి మార్మోగింది. రథసప్తమి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. వేంకటాద్రి సమీపంలోని సూర్యదేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సామూహిక సూర్య నమస్కారాలు చేశారు. ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు జరిపారు. స్వామి విశేష అలంకరణలో భక్తులను దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పాత్రలలో పాయసం తయారు చేసిన భక్తులు నైవేద్యంగా సమర్పించారు. ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, కార్పొరేటర్లు రాపర్తి కన్నా, పీలా శ్రీనివాసరావు, శానాపతి వసంత, ముమ్మన దేముడు, వైఎస్సార్‌సీపీ నేత గండి రవి, ప్రజాప్రతినిధులు స్వామిని దర్శించుకున్నారు.

భక్తుల పాట్లు

రథసప్తమి సందర్భంగా పెందుర్తి దేవాలయానికి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆలయ కమిటీ ప్రతినిధుల అత్యుత్సాహంతో అంతా గందరగోళంగా మారింది. ముఖ్యంగా క్యూలైన్లు ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు అవస్థలు పడ్డారు. ఆలయ ప్రాంగణంలో రాకపోకలకు ఒకే దారి ఉండడంతో ఓ దశలో తోపులాట జరిగింది. ఆలయ ప్రాంగణంలో కూడా భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. చివరకు సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు రంగంలోకి దిగడంతో పరిస్థితి సాధారణ స్థితికి వచ్చింది.



పెందుర్తిలో క్యూలో ఉన్న భక్తులు



సుజాతనగర్‌లో నైవేద్యంగా పాయసం వండుతున్న భక్తులు



పెందుర్తిలో.. వైఎస్సార్‌సీపీ నేత గండి రవి

2 వేల మందికి ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

రథసప్తమి సందర్భంగా పెందుర్తి సూర్యనారాయణస్వామి దేవాలయ ప్రాంగణంలో సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో భక్తులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీను నేతృత్వంలో దాదాపు 2 వేల మంది భక్తులకు ఓఆర్ఎస్ అందించారు. ట్రస్ట్ ప్రతినిధులు దెందేటి కృష్ణ, కోరి సూర్యనారాయణ, అల్లబోయిన రమణ, సునీత, తిమ్మ నారాయణ తేజ పాల్గొన్నారు.

సుజాతనగర్‌లో..

సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలోని సూర్యదేవాలయం, ఆంజనేయస్వామి దేవాలయ 5వ వార్షికోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. సూర్యభగవానుడి ఆలయంలో రథసప్తమి ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. గణపతి హోమం, పుణ్యాహవచనం జరిపారు. సామూహిక సూర్యనమస్కారాలు చేశారు. కార్పొరేటర్లు శానాపతి వసంత, ముమ్మన దేముడు తదితరులు ఆదిత్యుడిని దర్శించుకున్నారు.



భజన చెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు



క్యూలో భక్తులను నియంత్రిస్తున్న సీఐ సతీష్



ముత్యాలమ్మపాలెం అభయాంజనేయుని సన్నిధిలో

పరవాడ: ముత్యాలమ్మపాలెం శివారు హనుమాన్‌నగర్‌లో కొలువుదీరిన అభయాంజనేయస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. పరిసర గ్రామాల నుంచి భక్తులు అభయాంజనేయస్వామిని దర్శించుకున్నారు. నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మిసీతారామయ్య, పైల నేస్తాలు, దేముడమ్మ, లాలం అప్పలనాయుడు, సమ్మెంగ సోమేశ్వరరావు, కణితి చినసోమేష్, కూండ్రపు ముత్యాలు స్వామిని దర్శించుకున్నారు.

అప్పన్న గోశాలలో..

సింహాచలం: రథసప్తమిని పురస్కరించుకుని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో ఉన్న సప్తాశ్వ వాహన సూర్యనారాయణస్వామి సన్నిధిలో విశేష పూజలు నిర్వహించారు. స్వామికి పంచామృతాభిషేకాలు, అరుణ పారాయణం చేశారు. సూర్యనమస్కారాలతో స్వామిని కొలిచారు. భక్తులకు సింహాచలం దేవస్థానం పులిహోర ప్రసాదాన్ని అందించింది. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం స్వామిని దర్శించుకున్నారు. సింహాచలం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు.

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో..

సింహగిరిపైనున్న కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన సూర్యనారాయణస్వామి సన్నిధిలో రథసప్తమి పూజలను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి సన్నిధిలో అరుణపారాయణం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ప్రసాదంగా పరమాన్నం అందించారు. ఆలయ అర్చకుడు పేరి శ్రావణ్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.



సుజాతనగర్‌లో పూజలందుకున్న ఆదిత్యుడు



ఓఆర్ఎస్ వాటర్ తాగుతున్న భక్తులు



శ్రీకృష్ణాపురంలోని గోశాలలో సప్తాశ్వవాహన సూర్యనారాయణస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన సూర్యనారాయణస్వామికి పూజలు